# ఎవరికెవరు?

-చావా శివకోటి

ఓ అమ్మాయి ఉన్నది.

ఏ అమ్మ కన్న బిడ్డో మాత్రం తెలీదు.

ఇదే తెలీనపుడు, తండ్రిని గురించి ఆలోచించడం అవివేకం గదా!

వయస్సొచ్చాక. మన సమాజాన వెట్టి ఎత్తించే ఆలోచనలకు ఆస్కారం ఉన్నది గనుక ఆ గాలిన పడి, దిక్కు గానక, రట్టు భరించలేక గుట్టుగ కని వదిలేసి ఉండొచ్చు.

ఆడా, మగా, చూసేందుకు వేరువేరుగ కనిపించినా- మనుషులే గద!

అయితే గడప దాటాక. ఆడవేరు-మగవేరు.

కనడం ఆడవారి వంతు. కనేందుకు మనమో ఉపకరణం మాత్రమే (మగ) అనేది అర్థమయ్యాక. బాధ్యతగ మోసి కన్నదేమో?

ఇలా మనం తెలీన విషయాన్ని గురించి లేనిపోని ఊహలు చేసే కంటే కనిపిస్తున్న అమ్మాయి 'అనాథ' అనుకోవడం సబబు.

అయితే ఈ అమ్మాయి గుడ్డి బిచ్చగానికి ఆసరా అయ్యేందుకు తీసుకు రాబడింది. ఇదంతా ఎందుకు. అక్కడ దాకా నడుద్దాం.

అడిగో! అతగాడే. బిచ్చగాడు.

చింకి చాపన కూర్చుని, గుడిసె గుంజకు నడుం ఆనించి. పెరిగిన గడ్డం గోక్కుంటున్నాడు. గుడిసెవారన సత్తు గిన్నెను కడుగుతూంది పిల్ల. వీపు కనిపిస్తున్నది. పనిచేస్తున్నట్టు. కదలికలు చెపుతున్నాయి. జుత్తు వత్తుగ, చిరుగుల పరికిణీ తొడల వరకు ఎగదోసి గోచీ పెట్టుకున్నది. వాడసలు పుట్టు గుడ్డిగాడు. స్ఫోటకం పోసి కళ్లు కాయలు గాచినయి.

కళ్లు పోవడంతో చానా బెంబేలు పడ్డాడు, అరచాడు, పెద్దగ ఏడ్చాడు. గంగ వెఱ్ఱెత్తిన వానిలా చేసాడు. గుర్తులోకొచ్చిన ప్రతి దేవుణ్ణీ వదిలిపెట్టకుండా నానా బూతులు కూసాడు.

తిట్టితిట్టి సొక్కి ఆగాడు.

అప్పటిదాకా చూసిన లోకం. చీకటిన గుర్తులోకొచ్చి బాగా కుంగిపోయాడు.

అంతులేని 'కసి' పెరిగింది. దానికితోడు అసహనం.

ఎవరిమీద- ఎందుకు? అనేది మాత్రం అంతు పట్టలేదు.

ఆ ఉసిన చేతికేది దొరికినా కాలికేది తగిలినా వదిలేవాడు కాదు.

ఒకసారి పాము మెడ దొరికింది అదృష్ట వశాత్తు. అది చేతిని చుట్టుకొని విరిగిపోయేలా మెలితిప్పినా వదలలేదు. చేతి పట్టును మరీ కసిగ బిగించాడు. చచ్చింది. దాని కదలిక పూర్తిగా అణగిన తరువాత పట్టు సడలించి దూరంగా విసిరాడు. చచ్చిపడిన పామును చూసి ఇంతలేసి కళ్ళున్నవాళ్లు భయంతో బిక్కచచ్చారు. దూరంగా పరుగెత్తారు. ప్రాణం వుంటే మీద పడుతుందేమోనని.

దాని 'మెడే' ఎలా దొరికింది. గుడ్డోడు గదా! అని ఆశ్చర్యపోయారు.

ఏడ్చాడు- నవ్వాడు- వానికి తెలీదు దాని 'మెడ' ఎలా దొరికిందో!

అలా దొరక్కపోతే? అమ్మో. చచ్చేవాణ్ణి అనిపించింది.

'ఈ బతుక్కంటే చావు నయం' అని నిబ్బర పడ్డాడు.

కాలం ఆగదు కదా! దాని నడక దానిదే! ఏ సంబంధం లేని నిర్వికారమైన నడకది.

ఓ పొద్దుట నిద్రలేచాక "నాకూ ఓ తోడు ఆసరా వుంటే బాగు" అనిపించింది. ఇప్పుడది అందని కోరిక అనిపించింది వెంటనే.

కన్న తండ్రే కళ్ళు పోయినాక వదిలేసాడు. ఎటు పోయాడో తెలీదు. కానోళ్ళెవరొస్తారు? ఏం చూసి వస్తారు? ఏముందని?

కానీ- పిలిస్తే పలికేటందుకు ఇటు అటు అని చెప్పేటందుకు ఆసరా ఎలా?

అయితే తనను రోజూ అడ్డాకు చేర్చి, తన

ముందో గుడ్డపరచి చూపరులకు జాలి కలిగేలా కూర్చోబెట్టి రాత్రయ్యాక చిల్లర పోగేసిన గుడ్డను మడచి తీసుకొని వచ్చి ఇక్కడ వదిలేటోణ్ణి నెమ్మదిగ అడిగాడు.

ఒరే సుబాహూ! నాకో 'ఆసరా' లేంది గడిచేట్టు లేదురా! నువ్వు నన్నాడ ఒగ్గేసి పోయినంక మరీ అయోమయమవుతున్నదిరా! అని పెద్దగ నవ్విండు. చెప్పింది విన్నడు. ఆలోచనలో పడ్డాడు. అని ఓ మాట చెప్పిండు.

'ఇగో! నిన్న బొడ్డూడిన పసిదొకతి నా కళ్ళ బడ్డదిరా! ఏ దిక్కూ లేనిదే! మళ్లీ కనిపిస్తే వదలను. వెంటనే వొచ్చి నీ కప్పజెపుత. దానికీ ఆసరా అవుతది అని. ఒరేయ్! ఇదొకతుందని మన పెద్ద రాక్షసుడికి తెలిస్తే– దాని కన్నొకటి పీకేసి కాలో చెయ్యో జనానికి బాగ 'జాలి' అనిపించేలా విరిచేసి మరో అడ్డాన కూకోపెడ్తడేమోనని ఒళ్ళు వణికి గమ్మునున్న' అన్నడు.

మనసెట్టి వెతుకు. కాకుంటే నా వాటా పైకం రెండు దినాల్దీ ఉంచేసుకో. ఆ! అని చేతులు పట్టుకుని బతిమాలాడు.

పిల్లది దొరికింది. తీసుకొని వచ్చాడు కూడా. వాడు రమ్మంటే వెంటపడి వచ్చిందట. ఈడికి వచ్చాక 'వాణ్ణి చూసుకుంటా వుంటావె' అంటే. ఒక్కసారి పారజూచి తల వూపింది. తండ్రి లెఖన అనిపించిందో ఏమో!

అది మొదలు అక్కడే వుండిపోయింది. మూడు నాలుగేళ్ళు దాటింది. ఇప్పుడు దానికి పదో ఏడు తగిలింది. ఆడపోరి గద గోగుకాడలా ఎదుగుతున్నది. వచ్చిన నాటి నుంచీ దానికి గుడ్డోడు 'పేరు' పెట్టలా! అదేమో నా పేరిది అని చెప్పలే. బుడ్డది గద! 'చిట్టీ' ఇటావె అని పిలిచిండు వచ్చిందని చెప్పగనే. పలికింది, దగ్గర కొచ్చింది. పలికాక ఇంక మరో పేరెందుకు? బొమ్మకో గుర్తులాటిదే గద పేరు అని నవ్వుకున్నడు. తడిమి చూసుకొని పోరి వడ్డూ వంపూ లేక సవరంగానే వుందని తృప్తిపడ్డాడు. చిట్టి చిట్టి అని వాడు పిలు స్తుంటే బయటోళ్లు అట్టానే పిలిచారు, పలికింది.

సత్తు గిన్నె, గళాసూ, కడగడం పూర్తయి నట్టుంది తెచ్చి తడిక వారన పెట్టింది. చేతులు తుడుచుకుని గుడ్డోని ఎదురుగ కూర్చున్నది నావేపే చూస్తూ.

వానికి మాత్రం ఇది అట్టా కూర్చోవడం, చూస్తుండడం తెలీదు. వాని లోకానవాడున్నడు. ఏదైనా అక్కరొస్తే తప్ప ప్రతి చిన్నదానికీ పిలవడు. పిలువడు గనుక పలకదు.

చిట్టిది 'మూగది' గాదు మాటలొచ్చు. గొంతు అందంగుంటది. ముచ్చటగుంటయి మాటలు. తెలుగు తురకం కలగలిపిన యాసన మాటాడతది. దాని పసితనం అట్టాటి ఏరియాన ఉన్నదేమో! ఉన్నాక మాటా మంచీ అట్టనే వుంటంది గద!

చిట్టీ అని పిలిచాడు గుడ్డోడు.

'ఆ!' అని పలికింది.

ఎదురుగానే వున్నట్టుగ అర్థమైంది.

'ఈడనే ఉన్నావటే?' అని సంతోషంగ నవ్విండు.

అటూ ఇటూ మెసిలి 'చిట్టీ! నరకాసురుడెట్ట ఉంటడే!' అనడిగాడొకనాడు.

'చానా దినాలు వీనికి కళ్ళు ఉన్నయి గద! అప్పుడు వీధి భాగోతాలలోనో, సినిమాలలోనో చూసే వుంటడు' అనుకొని 'కాకా! నువ్వు సినిమాలు చూసినవా?' అనడిగింది.

'ఒసేయ్! బడవకానా! పరాసికంగ ఉన్నదటే. గుడ్డోణ్ణి పట్టుకొని సినిమాలు చూసానంటావా?' అన్నాడు కోపం తెచ్చుకొని. చేతులు చాపి చిట్టి దొరుకుతదేమోనని పట్టుకొనబోయిండు.

'నీతో చెతురేంది గాని కాకలూ! పాతికేళ్లొచ్చిం దనక నీకు కళ్ళున్నయట గదా! నా మాదిరిగ అప్పుడు చూసే ఉంటవు గద!' అంది అందకుండ జరిగి.

'ఆ! అవునేయ్! నా మతి మండ. అప్పుడు నేను అంతా చూసిన. చూసినవి చానా ఇప్పటికీ గుర్తులో ఉన్నయి. మా అయ్య, ముత్తవా! నాయనమ్మా! రాచిప్పంటి మా మేనత్త. దాని కూతురూ' అని ఆగాడు.

ఏవేవో ఆలోచనలు తలను ముసిరినయి.

'చెప్పు కాకా! చెప్పు! గుర్తు తెచ్చుకో! నాకయితే ఇప్పుడు నువ్వు చెప్పిన వాళ్ళెవురూ లేరు. లేరు గనక గుర్తులోకే రారు. నాకంటే నువు చానా

అదృష్టవంతుడివి. అందరూ ఉన్నారు. అందర్నీ చూసినవు. వాంళ్ళతో ఉన్నవు. ఉన్నోళ్ళని తలచు కొంటే సంబరంగ ఉంటది చెప్పు. వట్టియి చెప్పకు. కల్లలు నిజం కావు' అంటూ మరీ దాపుకు చేరి చేతిని పుచ్చుకుని బామాలింది.

'చెపుతలేవే! చూసింది చెప్పటానికేముంది. నాకూ మాలావు ఇదిగనే ఉంటది' అని.

నాకో మేనత్త ఉందంటిని గదా! దానికో కూతురుంది. దాని పేరు 'ఆది' ఆదిలచ్చి. అది ఎదురు పడ్డపుడల్లా. 'అదేం పేరే' నీలాగే ఉంది పేరూను అని నవ్వుతూ చెతుర్లాడేవాణ్ణి. అది సిగ్గుతో వారకు తప్పుకునేది. అది నిజంగానే నేరేడు పండు రంగున ఉండేది. కానీ మొఖం చానా కళగుండేది. చూసిన కొందీ చూడబుద్ధయ్యేది. కాళ్ళకు గజ్జెలు పట్టీలుండేవి. అడుగు కదుపుతుంటే ఘల్లుఘల్లు మన్న చప్పుడు నిమ్మళంగ వినిపించుతుండేది. దానికి ఈడు వచ్చిన కాడ నుంచీ 'అరేయ్! దీన్ని కట్టుకుని నా బరువు దింపరా!' అంటూ అత్తమ్మ ఎంటపడుతుండేది.

'కట్టి ముండనొకదాన్ని కని నాకు ముడిపెడ దామనుకుంటన్నవా! దీన్ని మనువాడాలంటే అమ్మో చానా కట్నం గావాలె' అనెటోడ్ని ఆట పట్టిస్తూ.

మనసున మాత్రం దాన్ని మనువాడాలనే ఉండేది.

'ఓరి! ఎట్టి ఎదవా! నాకున్నదంతా దానికే గదరా! నువ్వు మొదట దాని మెడన మూడు ముళ్ళేయి. నా పాకలోనే ఉందువు గాని' అని దాపుకొచ్చి ఎవరికీ వినపడకుండ 'ఇగో! ఎండి వడ్డాణం చేయించిన. గజ్జల పట్టీలు, దండగడెం, బంగారపు బేసర, ముక్కుపుల్ల, ఓ జత గాజులు. అంతేగాదు నీకు అయిదొందలు వరకట్నమిస్త. గడియారం పెట్ట. సైకిలు గొనిస్త. ఓలి డబ్బు సుదా అడగ. ఆ!' అని మెటికలిరుస్తూ మురిసిపోయేది.

కాలం ఆగదు. ఎండలొచ్చినయి. మా అయ్య ఇక లగ్గానికి పోదంరా అన్నడు.

తలవిసిరిన. పంతులు గార్ని అడిగి తేదీ గూడ ఖరారు చేసినారు.

అయితే మేము లగ్గానికి పోయేందుకు రెండు రోజులుందనగ నాకు 'పులకరం' తగిలింది. 'తగ్గుతదిలే' అనుకున్న. కాని తెల్లారి మోపయింది. బొత్తిగ లేవలేకపోయిన. అది మొదలు తీపూ మోపూ లేకుండ మూడు దినాలు జొరం. ఈలోపున ఒంటిమీద బొగ్గలు మొదలయినయి. అది చూసి 'ముత్తాలమ్మ తల్లి' పోసింది అన్నరు. దానికి వైద్యం లేదన్నరు. అది మొదలు అయ్య, అతమ్మ వేప మండలు దెచ్చి విసిరినారు. పక్కన వేపాకేసినారు. బొగ్గలు లావయిన కొద్దీ ఒళ్ళంతా మంటలు, కళ్ళు మండినయి. వాటిలోనూ బొగ్గ లొచ్చినయ్యేమో! తెరిపిళ్ళు పడలేదు. మంటలకి తట్టుకోలేక తెగ మొత్తుకున్న. కళ్ళలో పోటు పడలేక రుద్దుకున్న. ఇంకా భగ్గుమన్నయి. దినాలు గడిచినకొద్దీ ఒళ్ళంతా అట్టలు గట్టినయి. బొగ్గలు చితికినయి. నెమ్మదిగ కళ్ళు తెరిచిన. అంతా చీకటి. కంళ్ళన కూడ కాయలు. 'అయ్యా! ఏమీ కనపడడం లేదే!' అని అరిచిన, మొత్తుకున్న, నేలమీద పడి దొర్లిన.

అయ్యేమో– 'ఇదేం ఖర్మరా' అని ఏడ్చిండు.

అత్తమ్మ మాత్రం నా కళ్ళు పోయినయని తెల్సినంక ఆడ కనపడలే. దాని మాట వినపడలే అని ఆగాడు. నిజంగ కాకయ్య కళ్ళ నుంచి నీరు జారుతూ కనిపించింది.

'ఊర్కో కాకా! ఊర్కో! మన రాత అది' అని భుజాన చెయ్యేసి కన్నీరు తుడిచింది.

'నెల దిరక్క ముందే– అత్త కూతురు మను వయిందని తెల్సింది' అన్నడు నెమ్మదిగ.

'కాకా! మన పిచ్చి గానీ– కన్నపోరిని తెలిసి గుడ్డోనికి కట్టపెడ్తరానె' అంది.

చిట్టిని దగ్గరకు తీసుకొని తలూపిండు. కూసేపాగి– 'చిట్టీ నువ్వు నలుపా, ఎఱుపా!' అన్నాడు కాకయ్య.

'చామన చాయగ ఉంటనంటరే!' 'నీ మేన కోడలు లెఖన నేరెడి పండు రంగయితె గాదు' అని కిలకిల నవ్వింది. చిట్టిని ముద్దుగ ఇంకా దగ్గరికి తీసుకున్నడు.

ఓ నిముషమాగి 'చిట్టీ! నన్నొదిలి పోవు గద!' అన్నాడు. చూస్తున్నది చిట్టి.

'అది గాదే! నీకు మగడొస్తే- వెంట పోవాల్సి వస్తది గంద!' అన్నడు గొంతు జీరబోయింది. కనురెప్పలు తడయినయి.

కాకయ్య పెదాలకు చేయడ్డం పెట్టింది. 'గాఫికరు పెట్టుకోకు. నాకెవ్వరూ వద్దు'. నే నెగేసు కొనిపోతే నిన్నెవరు చూత్తరు. కనపడనోడివి అసలెట్లుంటవు? అంది. కాకా వడిన వదిగి కూర్చుంటూ.

'దేవుడూ! ఏందిది? మంచిగున్న కంళ్ళు తీస్క పోతివి. బతకలేనపుడు చిట్టిని దరిచేర్చితివి. ఇంక ఏమేం జేస్తవో నీకె తెలియాలి' అని సణుగు కున్నడు.

✿✿✿

'వీడే. వీడేనండి గుడ్డోడు' అన్న మాటకు ఉలిక్కిపడి లేచిండు.

చెవి రిక్కించిండటేపు ఇంకేమంటరోనని. 'చిట్టీ' అని పిలిచిండు. ఆసరా అదే గద!

'వీడే' అన్న గొంతే- 'ఒరేయ్! గుడ్డోడా?' అని పిలిచింది.

'ఓరు' అన్నడు కూకుంటూ. చిట్టేదీ, చిట్టీ అని మళ్ళీ పిలిచిండు కళ్లు పట్టుకుని.

'వీడ్ని తీసుకురండి' అన్న మాట వినిపించింది.

'మీరు ఎవరు బాబూ! ఎవర్ని తీస్కరమ్మంటు న్నరు' అన్నడు. అంటుండగనే ఇద్దరు మనుష లొచ్చి కాకయ్యను లేపి పట్టుకొని నడిపించ సాగారు.

'నన్నేడికి తీస్కపోతన్నరు? చిట్టికి చెప్పొత్త. అది గాబరపడ్తది' అన్నాడు.

'చిట్టి ముందున్నదిరా. అది చిట్టో కాదో నువ్వు చెపుదువు గాని నడు' అన్నాడు అధికారికంగా.

'పోలీసు గొంతులా గుందదేంది?' అను కున్నడు.

నడిపంచిటోళ్ళను తడిమిండు. గంజి గుడ్డలు. గుండె అబిక్కుమన్నది.

వీంళ్ళు కాఖీ వోంళ్ళు గద! నన్నేడికి తీస్క పోతున్నరు? ఏమి చేయకున్నా తీస్కపోతరు. వాంళ్ళని అడిగెటోడెవడు? అనుకొని నెమ్మదిగ. 'బాబూ! నన్నేడికి నడిపిస్తున్నరు. నేనేం జేసిన? ఏమీ చేయలేని గుడ్డోణ్ణి గద!' అన్నడు.

వీని మాట వింటున్నారో లేదో గాని నడి పిస్తానే ఉన్నరు. చానా దూరం నడిపించినారు. ఒకచోట ఆపి 'అక్కడికి తీసుకుపోండి' అన్నాడు. తీసుకుపోయినారు.

'ఇదిగో! గుడ్డోడా ఈడ కూర్చో!' అన్నాడు.

## ముువ్వన్నెల కేతనం

ఎత్తవోయి సోదరా!
మువ్వన్నె కేతనం
ఎలుగెత్తి పాడరా!
ఏరులై ఉప్పొంగరా!

॥ఎత్త॥

అదిగో... అదిగదిగో ఆకసాన
అల్లంత దూరాన ॥అది॥
ఎగురుతుంది మన జండ
యశోకాంతులు నింద

॥ఎత్త॥

నిర్మలమగు మన జండ
మనకందరికీ అండ ॥నిర్మ॥
దాని నీడలందు మనం
నడవాలి దినం దినం

॥ఎత్త॥

బోసి నవ్వుల తాత
పసిడి కలల పంట ॥బోసి॥
విశ్వ మానవ హృదయాలు
విచ్చుకొనిన దినమంట

॥ఎత్త॥

బానిస బ్రతుకుల నుండి
బయటపడిన దినమంట ॥బాని॥
శాంతి సుధలు కురిసెనంట
సౌభాగ్యం విరిసెనంట

॥ఎత్త॥

*(15 ఆగస్టు–స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా)*

-పున్న అంజయ్య

'ఎందుకు బాబూ!'

నీ కాళ్ళ ముందో ఆడకూతురున్నది. అది నీకు తెలుసేమో తడిమి చెప్పు అన్నాడు. లాఠీ ఎత్తి బాదినట్టుంది వాని గొంతు.

'ఇందరు కళ్ళున్న వాళ్ళు– నన్నడుగుతరేంది? అనిపించి నవ్వొచ్చింది. అదోలా నవ్వుతూ కూర్చున్నడు. జారిందు కూర్చోబోతూ. పక్క నున్నోళ్ళు పడనీయక పట్టుకున్నరు. కింద ఉన్న ఆడ కూతురుపై గుడ్డోడి చేతిని జరిపినారు. నెమ్మదిగ తడిమిండు. పాదం దగ్గర నుంచి తల వరకూ. మళ్ళీ మళ్ళీ అనుమానంగ తడిమి 'అమ్మా! చిట్టీ ఏందే ఇదీ! నీకు నూరేళ్లు నిండినయా తల్లీ!' అని దానిపై బడి పెద్దగ ఏడ్చిండు.

గుడ్డి కళ్ళ నుంచి కారిన నీరు గుండెంతా తడిపింది.

'గుడ్డోడా! ఇకలే!' అని లేపినారు. వారికున్న అనుమానం తీరిపోయింది. మళ్లీ గుడ్డోడ్ని నడిపించినారు. నడిపిస్తూ 'పోష్టుమార్టం కాంగనే నీకే అప్పగిస్తాం' అన్నరు.

వాని పాక ముందు వదిలేసి ఎల్లిపోయినారు.

సుబాహ వచ్చి వీని కోసం అప్పటికే చూస్తున్నడు. సంగతి తెల్సింది.

'ఈ పొద్దు నేనూ పోను. చిట్టొచ్చినంక మట్టిన కలుపుదాం' అని చతికిలపడి ఏడ్చిండు.

'అరె! సుబాహూ! బిడ్డ చలికట్టె పడి ఉన్నదేందిరా! నా చిట్టికేమైందటరా! అసలక్కడ ఎందుకుంది! నాకు చూపు అదేగదరా!' అన్నడు కంళ్ళు తుడుచుకుంటూ.

'గుడ్డోడా! నువ్వే అద్రుష్టవంతుడివిరా! ఇట్టాటివి కంటపడవు' అని భుజాన చెయ్యేసి 'ఏం లోకంరా ఇది! మనుషులట్రా వాంళ్ళు! నడుస్తున్న శవాలు నయం! అరె ముక్కుపచ్చలారని 'పోరి'ని ఆగం జేసి చంపుతారట్రా! దాన్ని చూస్తే మనిషన్నోడికి అట్లాంటి ఊసు వస్తదట్రా!' అనగానే గుడ్డోడు– 'ఓరి దేవుడోయ్! దాన్నీ తీస్కపోయినావురా! ఇప్పుడు నీ కళ్ళు చల్లగున్నయ్యా? ఎద్దు లాగున్న నేను కనపడలేదురా! దాన్ని దాన్ని ఛ. నువ్వు దేవుడివెట్టా అయ్యావురా! అరె ఇట్టాటి దానికి పసిదానికి బతుకెందుకిచ్చినవు? నా తానకెందుకు పంపినవు. మళ్ళీ ఇట్ట చేసినవేంది? అని నేలపై పడి పొర్లాడసాగాడు. వాని దుఃఖం ఆరేదీ తీరేదీ కాదనిపించింది.

సుబాహు మందలించకుండ కళ్ళు తుడుచుకుంటూ చూస్తుండిపోయాడు.

చానా మంది పోగయినారు. ఎవ్వరూ నోరు మెదపలేదు. కాని అందరి కళ్ళలోనూ నీరు. పొద్దు వంగింది.

అంబులెన్సు వస్తుందని జనం తోవ ఇచ్చినారు.

వచ్చింది, ఆగింది, దిగినారు. 'చిట్టి'ని దింపినారు. కాకయ దగ్గరకొచ్చారు. 'గుడ్డోడా' అని పిలిచారు. పలుకులా మూలిగిండు. నెమ్మదిగ కూర్చున్నడు. కూర్చుంటూనే చిట్టి, అరేయ్ అని సణుగుతూ నేలకొరిగిండు.

సుబాహు నెమ్మదిగా దాపుకు చేరి కూర్చుని గుడ్డోడ్ని పట్టుకొని కదిపిండు.

కరంటు షాకు కొట్టినట్టు వెనక్కు జరిగి 'వీడూ పోయిండు, పోయిండు' అని నణిగిండు. వచ్చినోళ్ళు డాక్టరుకోసం లగెత్తినారు. అయిదు నిముషాల్లో కార్లో వచ్చిండు డాక్టరు. చూసిండు, పెదవి విరిచిండు. కారెక్కి పోయిండు.

'ఇద్దర్నీ పూడ్చిపెట్టాలి గద!' అన్నారు అక్కడున్న మందితో అంబులెన్సోళ్ళు.

విన్నరు. అవుననలే, కాదనలే. కొందరు వెనక్కి మళ్ళినారు. కొందరు కదలక చూస్తుండిపోయినారు.

మళ్ళీ ఎవర్నీ ఏమీ అడగలేదు అంబులెన్సోళ్ళు. వెళ్ళి మున్సిపాలిటీ వ్యాన్ను పట్టుకొచ్చినారు.

అది కనిపించాక సుబాహు తప్ప మనిషి మిగలలే.

వచ్చినోళ్ళు ఇద్దర్నీ– వ్యానున వేసుకున్నరు. వ్యాను కదిలింది. పొద్దు భూమిన పూర్తిగ జొరబడింది. లోకం మసక బారింది.

✿✿✿

బ్రతుకున బాధే శాశ్వతమనీ. సంతోషం చుట్టపు చూపుగ వచ్చిపోయేదనీ అది నిజంగా, నిజమనీ చాలాసార్లు అనిపిస్తుంది. కానీ– ■